


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

**అయితే రిజర్వు బ్యాంకులో** మా పని కాలేదు. ఫైనాన్స్ మినిస్ట్రీ ఉత్తర్వు కాపీ రిజర్వుబ్యాంకు కలకత్తా బ్రాంచికి చేరలేదట. ఆ ఉత్తర్వంటే తప్ప పీ ఫారం మీద వారి ఆమోద ముద్ర పడదట.

"మా లాబరేటరీకి ఆ ఉత్తర్వు వచ్చింది. ఎందుకైనా మంచిదని దాని ట్రూ కాపీ ఒకటి తెచ్చాం." అంటూ భూషణ్ అది చూపించాడు.

అక్కడి గుమాస్తా ఆ కాగితాన్నోసారి ఎగాదిగా చూసి "ట్రూ కా పీలు మేము నమ్మం. ఒరిజినల్ ఉండాలి" అన్నాడు.

"ఈ ట్రూ కాపీని సాక్షాత్తూ మా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు అటెస్టు చేశాడు. ఇంకా కావాలంటే ఇక్కడే మీ రిజర్వుబ్యాంకులోనే పనిచేస్తున్న మరో బాధ్యతగల ఆఫీసరు దాని విషయమై హామీ యిస్తాడు" అన్నాను నేను.

ఆ గుమాస్తా చిద్విలాసంగా నవ్వి - "అయ్యా! ఎవరు అటెస్టు చేసినా ట్రూకాపీ ట్రూకాపీయే కదా! మాకు ఒరిజినల్ కాపీ కావాలి. అది ఒకటి రెండు రోజుల్లో ఇక్కడకు పోస్టులో రావచ్చు. అది వస్తేనే మీ పని అవుతుంది. అది రాని పక్షంలో సాక్షాత్తూ దేశానికి ప్రధానిమంత్రి ఐన ఇందిరాగాంధీ అటెస్టు చేసినా ట్రూకాపీలను మేము పట్టించుకోము" అన్నాడు నిర్లక్ష్యంగా.

అక్కడ పని జరుగదని తెలిసిపోయింది. దేశం దాటి వెళ్లడానికి పీ - ఫారం చాలా ముఖ్యమైనది. నా చేతిలో ఫారిన్ రేఖ లేక ఈ ఇబ్బంది రాలేదు కదా అని భయపడ్డాను.

సాయంత్రం నేను, భూషణ్ విడిపోయాం. అన్నయ్యతో కలిసి ఇంటికి వెళ్లాను. వదిన నన్ను చూసి ఆశ్చర్యపడింది. అక్కడ అప్పుడే శ్రీమతి ఉత్తరం నాకోసం ఎదురుచూస్తోంది. అందులో మా ఫామిలీ ఫోటో ఉంది. అద్భుతంగా కనపడింది నాకు.

కలకత్తాలో మూడురోజులున్నాను. ఫైనాన్స్ మినిస్ట్రీ ఉత్తర్వక్కడి రిజర్వ్ బ్యాంకు ఆఫీసుకు రాలేదు. ఢిల్లీ వెళ్లి సీయస్సయ్యారాఫీసు నుంచి ఓ ఒరిజినల్ కాపీ తీసుకుని అక్కడి రిజర్వ్ బ్యాంక్‌లో ఆ పని పూర్తి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. అన్నయ్య మిత్రులు ఢిల్లీలో మాకు సాయపడగల వారి చిరునామాలిచ్చారు. కలకత్తా లుఫ్తాన్సా వారు ఢిల్లీ లుఫ్తాన్సా వారికి మా సమస్య గురించి టెలెక్స్ సందేశంలో మాకు సాయపడమని చెప్పారు.

రిజర్వుబ్యాంకులో పనిచేస్తూ పీ ఫారం విషయంలో నాకు సాయపడలేని తన అసహాయతకు అన్నయ్య చాలా బాధపడ్డాడు.

అన్నయ్య, వదిన నాతోపాటు ఢిల్లీ వస్తామన్నారు. అందర్నీ వదిలి యుద్ధానికి పోతున్న వాడి అనుభూతి నా మొహంలో చూసి వాళ్లలా అని ఉండొచ్చు. వాళ్లలా అనగానే నాకు కొండంత ధైర్యం వచ్చింది.

ఒక్కరోజులో బట్టలు కుట్టిచ్చే ఓ టైలరింగ్ షాపులో రెండు ఉలెన్ పాంట్లు కుట్టించుకున్నాను. జర్మనీలో క్షౌరం చాలా ఖరీదని విన్నాను కాబట్టి బయల్దేరే ముందు జుత్తు పొట్టిగా ఉండేలా క్షౌరం చేయించుకున్నాను.

ఢిల్లీ ప్రయాణం చాలా సుఖంగా జరిగిపోయింది. అన్నయ్య వదిన ఒక రోజు ఢిల్లీ నగర సందర్శనం చేశారు. నేను, భూషణ్ ఢిల్లీ లుఫ్తాన్సా ఆఫీసుకు వెళ్లాం. అక్కడ పీ - పారం పని పూర్తయింది. విమానం టికెట్సు కూడా రెడీ అయ్యాయి. టిక్కెట్ రాసే అతను మమ్మల్ని వెజిటేరియనా, నాన్ వెజిటేరియనా అనడిగాడు.

నేను వెజిటేరియన్. భూషణ్ నాన్ వెజిటేరియన్.

అప్పుడే విమానం ఎక్కుతున్నట్లూ నేనూ, భూషణ్ విడిపోతున్నట్లూ ఫీలయ్యాను.

ఆ రోజు రాత్రి ఢిల్లీ రైల్వే స్టేషన్ రిటైరింగ్ రూంలో భూషణ్ నా అలవాట్లను ఖండిస్తూ - "ఇవే అలవాట్లు మీ వాడు ఫారిన్లో కొనసాగిస్తే ప్రాణాలక్కూడా ప్రమాదం. నేను చెబితే వినడం లేదు. మీరైనా నచ్చచెప్పండి." అని అన్నయ్య వదినలకు చెప్పాడు. వాళ్లిద్దరూ హడలిపోయి "తప్పమ్మా - ఆ భూషణ్ చెప్పినట్లు వినమ్మా" అన్నారు ఏక కంఠంతో.

"తప్పకుండా వింటాను" అన్నాను వినడం మాత్రమే కదా అని.

అన్నయ్య, వదినలతోపాటు భూషణ్ కూడా సంతోషించాడు.

మర్నాడుదయం మాకు డాడ్ ఆఫీసులో వీడ్కోలు విందు ఏర్పాటు చేయబడింది. డాడ్ డైరెక్టరయిన ఆమె రెండు నెలల సెలవు మీద తన ఊరు వెడుతోంది. ఆమె మాతోనే ప్రయాణం చేస్తుంది.

జర్మనీ పరిస్థితులు ఇండియా వాతావరణానికి భిన్నం కాబట్టి ఎవరికే సందేహాలున్నా అడగమన్నారు. ఢిల్లీ డాడ్ ఆఫీసు ఉద్యోగస్థులు. అక్కడ సీయస్సయ్యారు వాళ్లే కాక, యూనివర్సిటీలు, డిఫెన్సు లాబరేటరీస్ వగైరా వివిధ సంస్థలకు చెందిన వారు మొత్తం ముప్పై మంది దాకా ఉన్నారు.

అప్పుడు ఢిల్లీలో ఎండలు మండిపోతున్నాయి. అందువల్ల కాబోలు ఒక జర్మనీ వనిత - "మీరు చలి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. టెంపరేచర్ ఇప్పుడు ఏకంగా ఇరవై డిగ్రీలుంది. దట్టమైన ఉలెన్ స్వెటర్లుంచుకోండి" అంది.

ఇరవై డిగ్రీలనగానే ఆమె అలాగనడం నాకాశ్చర్యం కలిగించింది. భువనేశ్వర్‌లో నా లాబరేటరీలో నాకో ఎయిర్ కండిషన్డ్ రూముంది. అందులో శీతాకాలం టెంపరేచరు ఒకోసారి పద్దెనిమిది డిగ్రీల వరకూ వస్తుంది. అందులో నేనెప్పుడూ స్వెట్టరు కూడా వేసుకోలేదు. ఒకసారి బెంగుళూరు వెడితే అక్కడ చలిగా ఉన్నా స్వెట్టర్లేకుండానే తిరిగాను. టెంపరేచరు పన్నెండు డిగ్రీలని చెప్పుకున్నారు. అలాంటప్పుడు ఇరవై డిగ్రీలని అంత విశేషంగా ఎందుకు చెప్పిందీ అని ఆలోచించి అతి తెలివి పనిచేయగా "ఇరవై అంటే మైనస్ ఇరవైయా?" అనడిగాను.

ఆమె నా వంక ఓరి అమాయకుడా అన్నట్లు చూసి "మైనస్ ఇరవై అయితే మిమ్మల్నక్కడికిప్పుడు పంపిస్తామా? అసలు మాకే కష్టం" అంది.

ఢిల్లీ ఎండల కామెకు మతిపోయి ఇరవై డిగ్రీలకే మమ్మల్ని భయపెడుతోందని నాకనిపించింది. అదీకాక ఫారినర్సు జీవిత విధానంలో అతిశయోక్తులెక్కువ.

విందైనాక నేను హడావుడిగా అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకుకు వెళ్లి రూపాయలిచ్చి విదేశీ మారకద్రవ్యం కొన్నాను. జర్మనీలో మార్కులు కాబట్టి అవే తీసుకున్నాను. వంద మార్కులు డ్రాఫ్టు రూపంలోనూ, ఇరవై మార్కులు క్యాషుగానూ ఇచ్చాడు. విదేశీ కరెన్సీ చేతిలో ఉంటే విచిత్రంగా అనిపించింది.

ఆ రోజు మధ్యాహ్నం నేను ఢిల్లీలో ఉలెన్ స్వెట్టరు కొన్నాను. సెలక్షన్ భూషణ్‌ది. జీవితంలో నేను కొన్న మొదటి స్వెటరది.

అన్నీ కొని నాలికబద్ద విషయం మరిచిపోయాను. జర్మనీ భాషలో నాలికబద్దనేమంటారో తెలియదు. అదక్కడ దొరికేదీ దొరకనిదీ తెలియదు. నా నాలికబద్ద విరిగిపోయింది. అందువల్ల అన్నయ్య కూతురికో రాగి నాలికబద్ద ఉంటే తీసుకున్నాను. తన నాలికబద్ద ఫారిన్ వెడుతోందని సంబరపడిందది.

ఢిల్లీలో చెప్పలేని ఎండలు. అయితే అక్కడ ఐస్‌వాటర్ రోడ్ల మీద అమ్ముతున్నారు. గ్లాసు అయిదుపైసలు. చల్లటి నీళ్లంటే నాకు ప్రాణం. చాలా గ్లాసులు తాగాను. అన్నయ్య భోజనం, టిఫిను సౌతిండియా హోటలే కావాలనేవాడు. ఢిల్లీ మహానగరంలో వాటిని పట్టుకోడానికి శ్రమ అయ్యేది.

మాతోపాటే తిరుగుతున్న భూషణ్ - "చిన్నపిల్ల, ఆడవాళ్లను బాధపెట్టడం దేనికి? ఓ పూటకు ఏదో చోట ఏదో ఒకటి తినేద్దాం" అన్నాడు అన్నయ్యతో.

"మా గురించి కాదు బెంగ. ఏమైనా తింటాం మేము. నా తమ్ముడికి ఒక్క రోజైనా ఇష్టమైనవి తినే అవకాశమిద్దామని" అన్నాడు అన్నయ్య.

భూషణ్ నా వైపు నిష్టూరంగా చుసి "నీ మూలంగా చిన్నపిల్ల కూడా శ్రమపడుతోంది" అన్నాడు.

నా మనసు చివుక్కుమంది - "నాకేమీ హితవే లేవు. నా కోసమే అయితే భోజనానికింతలా తిరగొద్దు" అన్నానన్నయ్యతో. నాకేమీ హితవులేని మాట నిజం.

"భూషణ్ మాటలకు నొచ్చుకోకు. మాకేమీ శ్రమలేదు. ఈ ఒక్కరోజూ నీక్కావలసినవి తింటే మాకదో తృప్తి" అంది వదిన. అన్నయ్య వంక తిరిగి "అసలే అతడికి మన బాబి అలవాట్లు నచ్చవు. మీరతడితో అలా మాట్లాడకండి" అంది.

నేను అతిగా ఐస్ వాటర్ తాగుతున్నందుక్కూడా భూషణ్ నన్ను అతిగా మందలించాడు. వదినక్కాస్త కోపం కూడా వచ్చింది. నేను భూషణ్ తత్వమే అంత అని ఆమెకు నచ్చ చెప్పాను.

మా విమానం బయల్దేరే టైము మర్నాడు తెల్లవారు ఝామున నాలుగు గంటల అయిదు నిముషాలు. పాలం విమానాశ్రయం ఊరికి చాలా దూరంలో ఉంది. అర్ధరాత్రి వేళ సామానుతో టాక్సీలో బయల్దేరి వెళ్లడం మంచిది కాదని చాలామంది అన్నారు. విమానాశ్రయం చేరుకుందుకు లుఫ్తానా వారేమీ ఏర్పాట్లు చేయడం లేదు. ఇండియన్ ఎయిర్‌లైన్సు వ్యానుంటుందనీ అందులో ప్రయత్నించమనీ వారు చెప్పారు. అదృష్టవశాత్తూ అందులో మాకు సీట్లు దొరికాయి. శ్రమ అని చెప్పినా వినకుండా అన్నయ్య, వదినలు విమానాశ్రయానికి వస్తామన్నారు నాతో.

రాత్రి పదిగంటల ప్రాంతంలో వ్యాను విమానాశ్రయానికి బయల్దేరింది. అందులో ఎక్కే ముందే నేను ఉలెన్ పాంటూ, పొడుగు చేతుల చొక్కా, జర్మనీ కోసమని ప్రత్యేకంగా కొనుక్కున్న కొత్త షూ వేసుకున్నాను. ఉలెన్ స్వెటరు భుజం మీద వేసుకున్నాను. ఎందుకంటే విమానంలోనే చలిగా ఉంటుందని కొందరన్నారు. బయల్దేరే ముందే సూట్‌కేసు బరువు చూసుకుంటే పదమూడు కేజీలుంది. నా లక్కీ నెంబరు వచ్చినందుకూ, బరువు ఇరవై కేజీలు మించనందుకూ చాలా సంతోషించాను. ఇరవై కేజీలు దాటితే పైన ప్రతి కిలోకూ అరవై డెబ్బైరూపాయల ఛార్జి అవుతుంది.

పాలం ఎయిర్ పోర్టు చూడడం అదే ప్రథమం. అసలు నేను చూసిందే ఒక్క భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు. అది చాలా చిన్నది, చాలా తక్కువ మంది జనం ఉంటారు. ఈ విమానాశ్రయం చూడ్డానికి గొప్పగా లేదు కానీ జనం నేల ఈనినట్లుగా ఉన్నారు.

విమానంలో మాతోపాటు వచ్చే డాడ్ స్కాలర్సు కొందరు మేమెక్కిన ఇండియన్ ఎయిర్ లైన్స్ వ్యానులో ఎక్కివచ్చారు. వారిలో ఒకతను ఫుల్ సూట్లో ఉన్నాడు. వదిన అతడ్ని చూసి నవ్వాపుకోలేకపోయింది. పరీక్షించి చూస్తే, అతడప్పుడే చలికి వణుకుతున్నాడు కూడా.

నేను వేసుకున్న పొడుగు చేతుల చొక్కాయే ఢిల్లీ ఉక్కకు నన్నిబ్బంది పెడుతోంది. చేతులు మడిచేశాను. అలాంటిదతడు ఫుల్‌సూట్లో ఎలా ఉండగలిగాడో!

"శరీరానుభూతులు మనసును బట్టి వస్తాయి. ప్రపంచంలో అన్నింటికీ మించిన వేగం మనసుది. అతడి మనసప్పుడే జర్మనీ చేరినట్లుంది" అన్నాడన్నయ్య.

ఎయిర్‌పోర్టు చేరుకున్నాక అతణ్ణి చూడడం ఒక కాలక్షేపం మాకు. అక్కడ రకరకాల వింతమనుషులు. విమానమెక్కేవారంతా ఆధునికులనుకుంటే అది పొరపాటు. కొందరు చూడ్డానికే మరీ పల్లెటూరి వారిలా ఉన్నారు. ఒకరిద్దరి వద్ద గుడ్డ మూటలు కూడా ఉన్నాయి. వాళ్ళు లండన్‌లో పనిచేసే భారతీయుల బంధువులని తెలిసింది.

భారతీయులే కాదు. విదేశీయులూ అలాగే ఉన్నారు. ఒక విదేశీయుడు అతుకుల గుడ్డ పాంటు వేసుకున్నాడు. తల జడలు కట్టేసింది. చొక్కాలేదు. వళ్ళు మాత్రం తెల్లగా మెరిసిపోతోంది. అయినా మనిషి బికారిలా ఉన్నాడు. అతడు మా పక్కనుంచి వెడితే భరించలేని వాసన గుప్పుమంది. అతడు మనదేశపు ఉక్క భరించలేక అలా ఉన్నాడన్నాడన్నయ్య. అప్పుడే ఫుల్‌సూట్ డాడ్ స్కాలర్ మమ్మల్ని దాటుకుంటూ వెళ్లాడు. అన్నయ్య అతడ్నోసారి పలకరించాలని మనసు పడ్డాడు కానీ జర్మన్ భాష మాట్లాడతాడేమోనని భయపడ్డాడు.

అక్కడ తిరుగుతున్న వారిలో ఒక భారతీయ వనిత ఉంది. ఆమె ఎంతో అందంగా ఉంది. చక్కగా చీర కట్టుకుంది. అంత చక్కటి ఆమె సిగరెట్ కాలుస్తోందని వదిన బాధపడింది. ఆమె షోగ్గా సిగరెట్ కాల్చడమే కాక – దమ్ము పీల్చినప్పుడల్లా తృప్తితో కూడిన ఆనందం పొందుతోంది.

"మనదేశంలో ఇది అరుదైన దృశ్యం. ఫారిన్లో ఆడాళ్లు సిగరెట్లు కాలుస్తారు. ఆల్కహాల్ పుచ్చుకుంటారు" అన్నాడన్నయ్య.

నేను వెడుతున్నదో కొత్త సంస్కృతి గల దేశానికని మరోసారి నాకు స్ఫురించింది. ఎయిర్‌పోర్టులో ఫారిన్ ఎక్స్‌ఛేంజి కౌంటర్లో నా టిక్కెట్టూ, పాస్‌పోర్టూ చూపించగా రూపాయలు తీసుకుని ఎనిమిది డాలర్లు ఇచ్చాడు. విదేశాలు వెళ్లేవారి కది మాములు. 'ఎరౌండ్ ది వరల్డ్ ఇన్ ఎయిట్ డాలర్స్' అన్న పాట గుర్తుకు వచ్చింది. నిజానికా డబ్బక్కడ ఏమూలకి?

విమానాశ్రయంలో పోస్టాఫీసుంది. ఇంటికో ఉత్తరం రాసి పోస్టు చేశాను. అంతవరకూ నేను చేసిన రైలు ప్రయాణ వివరాలూ, రసీదులూ రిజిస్టర్డు పోస్టులో భాస్కర్‌కు పంపేశాను. అతడవి ఆఫీసులో ఇవ్వాల్సి ఉంది. నా జేబులో ఉన్న రూపాయి నోట్లు, చిల్లర అంతా అన్నయ్యకిచ్చేశాను. కొద్దిసేపట్లో ఆ డబ్బుకు నా దగ్గర విలువుండదు.

విమానం తెల్లవారు ఝామున కావడం వల్ల మాకెవరికీ సరైన నిద్రలేదు.

రాత్రి ఒంటిగంట ప్రాంతాల సెక్యూరిటీ చెకింగ్‌కు పిలుపు వచ్చింది. అంతకు ముందే నా సూట్‌కేసు విమానాశ్రయంలోని లుఫ్తాన్సా ఆఫీసుకు అందజేశాను.

నా స్వెట్టరు వదినకిచ్చి సెక్యూరిటీ చెకింగుకు వెళ్లాను. అక్కడ ఓసారి వళ్లంతా తడిమి చూసి ఓ గదిలో కూర్చోమన్నారు. ఇప్పట్నించీ ఏం కూర్చుంటామని నేను బయటకు రాబోయాను. అక్కడున్న సెక్యూరిటీగార్డు నన్నాపి బయటకు వెళ్లడానికి వీల్లేదన్నాడు.

సెక్యూరిటీ చెకింగయ్యాక బయటకు వెళ్లడానికి వీల్లేదట. విమాన ప్రయాణానికి సంబంధించి బొత్తిగా ప్రాథమిక జ్ఞానంలేని నేను దెబ్బతిన్నాను. ఇంకా అన్నయ్య, వదినలతో చాలా మాట్లాడాలి. నా స్వెట్టరు కూడా వారి వద్ద ఉండిపోయింది.

"ఎప్పుడో నాలుగు గంటలకు వెళ్లే విమానానికిప్పట్నించీ సెక్యూరిటీ చెకింగ్ ఏమిటి?" అని నేను సెక్యూరిటీ ఆఫీసర్నడిగాను.

"అలా అనుకుంటే మీరు కాస్త ఆలస్యంగా రావలసింది. మూడున్నరదాకా సమయముంది" అన్నాడు ఆ ఆఫీసరు.

నేనా ఆఫీసర్ని బ్రతిమాలసాగాను. నాకీ విషయం తెలియదనీ, అవతల ముఖ్యబంధువులు నాకోసం ఎదురు చూస్తున్నారనీ నన్ను బయటకు వెళ్లనిమ్మని అతడ్ని కోరాను. కాసేపటికతడు కరిగి "రూల్స్ పర్మిట్ చేయవు. మీ పాస్‌పోర్టు చూడడం అయింది. అన్ని చెకింగ్స్ అయ్యాయి. సెక్యూరిటీ చెకింగ్ మీకు అయిపోయింది. అయినా నా పర్సనల్ రిస్కుమీద మిమ్మల్ని వెళ్లనిస్తున్నాను" అన్నాడు.

అతడి సహృదయతకు మనసులో కూడా ధన్యవాదాలర్పించుకుంటూ నేను కదలబోతూండగా మరొకతడు ఆ ఆఫీసరు దగ్గరకు వచ్చాడు. అతడి పేరు సుందరం. తెలుగు వాడు. నాకులాగే డాడ్ స్కాలర్ అతడిదీ నా పరిస్థితే. నేను సెక్యూరిటీ ఆఫీసరుతో మాట్లాడడం విని అతడూ బయటకు వచ్చాడు. ఆఫీసరతడికీ అనుమతినిచ్చాడు.

నేను వెళ్లేసరికి అన్నయ్య, వదినలు ఊరికే కంగారు పడిపోతున్నారు. భూషణ్ వదిన వాళ్ళని నా గురించడిగి "సెక్యూరిటీ చెకింగ్‌కి అప్పుడే ఎందుకెళ్లాడూ? ఇంక మీరతడ్ని చూడడం కుదరదు. నన్నడిగి వెళ్లాల్సింది. ఇప్పుడేమనుకుని లాభం? ఆ స్వెట్టరు నేను వెళ్లేటప్పుడిస్తాను ఇలాగివ్వండి" అన్నాడుట.

"అతడలాగంటే చాలా కంగారు పడ్డాం. అమ్మయ్య - నువ్వొచ్చేశావు" అంది వదిన.

"భూషణ్ చెప్పింది నిజమే!" అంటూ జరిగింది చెప్పాను నేను. భూషణ్ బంధువులు కొందరు పూర్వపు తూర్పు పాకిస్తాన్లోనూ, ఇప్పటి బంగ్లాదేశ్‌లోనూ ఉన్నారు. అందువల్ల అతడికి విమాన ప్రయాణంలో పూర్వానుభవముంది. ఈ విషయంలో ముందే అతణ్ణి అడిగి ఉండాల్సింది. సెక్యూరిటీ చెకింగవగానే - ఆ పని ముగించుకుని వచ్చి తీరిగ్గా మా వాళ్లతో కబుర్లు చెప్పుకోవచ్చుననుకున్నాను. అదీ నా తెలివి.

కాసేపటికి భూషణ్ అక్కడికి వచ్చి నన్ను చూసి ఆశ్చర్యపడ్డాడు. జరిగింది చెప్పాను. నేను బయటకు రాగలగడం అతడికి నచ్చలేదు. నా కోసం ఎంతో కష్టపడి ఇంత దూరం వచ్చిన అన్నయ్య, వదినలను వదిలి అలా వెళ్లడం బాగోలేదని అతడు మందలించాడు. నాకు తెలియదంటే నన్నడగవలసిందన్నాడు. అది పొరపాటేనని ఒప్పుకున్నాను. అయినా నన్ను క్షమించకుండా తిడుతూనే ఉన్నాడతడు. చివరకి నా సహనం నశించి "చూడు డాక్టర్ భూషణ్! నా అన్నా, వదినలను నేను నీకంటే ఎక్కువగా అభిమానించడంలేదని నీ అభిప్రాయమా? నేను కావాలనే సెక్యూరిటీ చెకింగ్‌కు వెళ్లానంటావా? లేకుంటే పొరపాటొప్పుకున్నా కదా - ఇంకా నన్ను వదలవే. ఆ సెక్యూరిటీ ఆఫీసరే నా పొరపాటు మన్నించాడు. నువ్వు మన్నించవేం" అన్నాను.

ఏమనుకున్నాడో అతడింకేమీ మాట్లాడలేదు. నేను నొచ్చుకున్నా ఫరవాలేదు, కానీ అతణ్ణి నొప్పించానేమోనని భయం వేసింది. కొన్ని విషయాల్లో నాకు లోకజ్ఞానం తక్కువైనట్లే, కొన్ని విషయాల్లో అతడికి లౌక్యం తక్కువ. నా క్షేమాన్ని కోరుతున్నాననుకుంటాడు తప్ప సిల్లీగా వ్యవహరిస్తున్నానని అతడనుకోడు.

అప్పుడు నాకు కలకత్తా రోడ్లపైన అతడు నన్ను చేయి పట్టుకుని రోడ్డు దాటించడం గుర్తుకొచ్చింది. ఒకసారి నేను రోడ్డు దాటుతుంటే - సిటీలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. రోడ్డుకి అడ్డంగా జీబ్రా చారలుంటాయి. అక్కడే దాటాలి అని ఆపాడు. అలాగని మరోసారి రోడ్డు దాటడం కోసం జీబ్రా చారలున్న వైపు వెడుతూంటే "మనకున్న టైము తక్కువ. జీబ్రా చారలున్న చోటే రోడ్డు దాటాలనుకుంటే - మన సమయమంతా రోడ్లమీదే సరిపోతుంది" అని మందలించాడు. అతణ్ణి గుడ్డిగా అనుసరించాలి. లేదా నొప్పించాలి. అప్పుడు మొదటిదే చేశాను.

మెత్తం మీద నేను బయలుదేరే క్షణం వచ్చింది.

అప్పుడన్నయ్య, వదిన కూడా నిద్రపోతున్నారు.

లుఫ్తాన్సా డి.సి 10లో ప్రయాణం చేయవలసినవారు సెక్యూరిటీ చెకింగ్ నుంచి బయలుదేరవలసి ఉంది. టైము మూడున్నరయింది. అన్నయ్యను, వదినను నిద్రలేపాను.

"వెడుతున్నాను" అన్నాను. నా గొంతు రుద్ధమయింది.

"వెడుతున్నాను కాదు. వెళ్లొస్తానను" అంది వదిన. ఆమె గొంతు రుద్ధమైంది.

"వెళ్లొస్తాను.."

"వెళ్లగానే ఉత్తరం రాయి.." అన్నాడు అన్నయ్య.

"నువ్వు జర్మనీ ఎనిమిది గంటల్లో చేరతావు. అప్పటికి మేమింకా ఢిల్లీలోనే ఉంటాం. మా ట్రయిన్ సాయంత్రం" అంది వదిన.

వాళ్లిప్పుడు పేరవరం వెడుతున్నారు.

"నేను క్షేమంగా విమానమెక్కానని చెప్పండి" అన్నాను.

"మీ ఆవిడ, పిల్లల గురించి బెంగ పెట్టుకోకు. నేనున్నానని గుర్తుంచుకుని నిశ్చింతగా ఉండు" అంది వదిన.

"భూషణ్ సలహాలు మరిచిపోకు" అన్నాడన్నయ్య.

నేను చటుక్కున భూషణ్ వంక తిరిగి అతడి చేయి పట్టుకుని "ఇంతవరకూ నువ్వెన్నో విధాల నాకు సాయపడ్డావు. నీ మేలు మరువలేను. నీ మనసుకేదైనా కష్టం కలిగించి ఉంటే మన్నించు" అన్నాను.

"నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను" అన్నాడు భూషణ్ అభిమానంగా.

"వస్తానన్నయ్యా - వస్తానొదినా!" అంటూ కదలడానికి ప్రయత్నించాను. కాళ్లు సహకరించ లేదు. అన్నయ్య కూతురప్పుడే నిద్రలేచి నాకు టాటా చెప్పింది.

వదిన కళ్లు తుడుచుకుంది. అన్నయ్య దిగులుగా చూశాడు. అక్కడున్న ఓ ముసలాయన అన్నయ్య భుజం తట్టి "మీ వాడెక్కడకు వెళ్లాలేమిటి బాబూ - అంత దిగులుగా ఉన్నారు?" అన్నాడు.

"ఫారిన్ వెళ్లాలండి" అన్నాడు అన్నయ్య నా వైపే చూస్తూ.

నా కళ్లలో నీళ్లున్నాయి కానీ తుడుచుకోలేదు. కాళ్లు ముందుకి చూపులు వెనక్కి.

మనసు నిండా దిగులు. ఏదో పోగొట్టుకుంటున్నట్లు దేనికో దూరమైపోతున్నట్లు... అనుభూతి.

ఒకటి కాదు, రెండు కాదు - పదహారు నెలలు!

కోరి తెచ్చుకున్న విరహమిది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments